సాక్షి
కుమురం భీం
ఆదివారం । 12 । మార్చి । 2023



మళ్లీ ప్రాణం పోసేలా..

గుండెపోటు వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ చేస్తే బతికే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 'సీపీఆర్'పై దృష్టి సారించాలని వైద్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. 8లో▸



మనసున్న మారాజులు

మనిషి మాయమైపోతున్నవేళ అక్కడక్కడ మనసున్న, మానవత్వమున్న వారు మెరుస్తూనే ఉన్నారు. మనీతో కాకుండా మనసుతో ఆలోచిస్తున్నాడు. 10లో▸

గరిష్టం/కనిష్టం
36.1 /20.4

వాతావరణం

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. చలి ప్రభావం ఉండదు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022– 23 సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుడిగా తెలుగు సబ్జెక్టును బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 14లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న కార్తీక్

ఆసిఫాబాద్‌అర్బన్: దేశవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిస్తామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో శనివారం డీవైఎఫ్ఐ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో కార్మికులు, విద్యార్థుల హక్కుల డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాడుతున్నామని గుర్తు చేశారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులకు యువత బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్యాంరావు, రాజ్‌కుమార్, నిఖిల్, సంతోష్, శ్రావణి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

17న బహిరంగ వేలం

కాగజ్‌నగర్‌టౌన్: 2023– 24 ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న కబేళాల్లో మేకలు, గొర్రెలు, పశువులను వధించుటకు ఫీజు వసూలు చేసే హక్కు కల్పించడానికి ఈ నెల 17న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు దక్కించుకునేందుకు ఆసక్తి గల వారు నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.లక్ష ధరావత్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

'ఉపకారానికి' ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

దహెగాం(సిర్పూర్): మండలంలోని చిన రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బండారి పోశం తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్‌లో నిర్వహించిన స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్షలో పాలె కార్తీక్, భీంకరి జశ్వంత్, తెలిగె అంకిత, తుమ్మిడె అజయ్‌కుమార్, దందెర ఉమ, చాపిలె శ్రావణి ప్రతిభ చూపినట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్లపాటు రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

'ట్రాఫిక్‌తో ఇబ్బందులు'

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య పెరిగి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని బీఎస్పీ తాలుకా ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ ఆరోపించారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ మలుపు వద్ద ఉన్న ఫారెస్ట్ ఆఫీస్ రోడ్డుకు అడ్డంగా పేపర్ మిల్లు యాజమాన్యం గోడ నిర్మించి దారిని మూసి వేసిందని పేర్కొన్నారు. తక్షణమే ఆ గోడను తొలగించి ఫారెస్ట్ ఆఫీస్ రోడ్డులో రాకపోకలు సాగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'

కాగజ్‌నగర్‌టౌన్: ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు, జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. కాగజ్‌నగర్‌లో శనివారం అల్లూరి లోకేష్ అధ్యక్షతన సీఐటీయూ జిల్లా సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలతో పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.



డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం లక్కీడ్రా తీస్తున్న అధికారులు

డబుల్ యోగం..!

- కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి
- 5,367 మంది దరఖాస్తు దారుల్లో 937 మంది అర్హుల గుర్తింపు
- లక్కీడ్రా ద్వారా 270 మంది ఎంపిక
- పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేశామని అధికారుల వెల్లడి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లోని చారిగాం రోడ్డులో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి వార్డుల వారీగా లక్కీడ్రా ద్వారా అర్హులను ఎంపిక చేశారు. అయితే ఎంపికైన లబ్ధిదారులు ఆనందంతో ఉండగా, లక్కీడ్రాలో పేర్లురాని వారు నిరాశ చెందుతున్నారు.

కౌన్సిలర్లపై ఒత్తిడి..

డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని లక్కీడ్రాలో పేర్లు రాని లబ్ధిదారులు కొంతమంది కౌన్సిలర్ల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. తమకు ఇళ్లు వచ్చే విధంగా చూడాలని వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ తమకు తలనొప్పిగా మారిందంటూ పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ, జనరల్ కేటగిరీ వార్డుల్లో పోటీ తీవ్రంగా ఉంది.

288 ఇళ్లు పూర్తి..

చారిగాం రోడ్డులో మొత్తం 288 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. కలెక్టర్ వీటిని పంపిణీకి సిద్ధం చేయాలని ఆదేశించడంతో అధికారులు లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు ప్రారంభించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డు ఉన్నాయి. అధికారులు ప్రతీ వార్డులో తొమ్మిది మంది చొప్పున 270 మంది లబ్ధిదారుల ఎంపిక చేశారు. మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల నుంచి డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం 5,367 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 937 మందిని అర్హులకు గుర్తించారు. 288 ఇళ్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో ఆయా వార్డుల్లో 270 మందిని అధికారులు లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, జనరల్ రిజర్వేషన్ల ప్రతిపాదికన వార్డుకు తొమ్మిది మందిని ఎంపిక చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందుబాటులో ఉన్న 288 ఇళ్లలో 270 లబ్ధిదారులకు కేటాయించనున్నారు. మిగిలిన 18 ఇళ్ల కోసం ఎంపిక ప్రక్రియను నిర్వహించలేదు. త్వరలోనే వాటికి కూడా లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. ఇదిలా ఉండగా లక్కీడ్రాలో పేర్లు రాని లబ్ధిదారులు తమకు అన్యాయం జరిగిందంటూ ఆయా వార్డుల్లో అధికారులను నిలదీసేందుకు ప్రయత్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పారదర్శకంగా లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల వద్దకు అనేక మంది లక్కీడ్రాలో పేర్లు రాని వారు వచ్చి తమకు కూడా ఇళ్లు కేటాయించాలని కోరారు. అధికారులు వారికి నచ్చజెప్పి పంపినట్లు తెలిసింది.

బోరిగాం సమీపంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లు



నిబంధనల ప్రకారమే ఎంపిక



డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా నిర్వహించాం. కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డుల్లో లబ్ధిదారులు, వార్డు కౌన్సిలర్, ప్రజల సమక్షంలో లక్కీడ్రా నిర్వహించాం. తప్పులు దొర్లకుండా పకడ్బందీగా ప్రక్రయను ప్రశాంతంగా పూర్తిచేశాం. మరో రెండు, మూడు రోజుల్లో వార్డుల వారీగా ఎంపిక చేసిన 270 మందికి ఇళ్లు కేటాయించే ప్రక్రియ పూర్తి చేస్తాం.

– ప్రమోద్ కుమార్, తహసీల్దార్, కాగజ్‌నగర్

'పరీక్ష' కాలం!

- ఈ నెల 15 నుంచి ఇంటర్, ఏప్రిల్ 3 నుంచి 'పది' పరీక్షలు ప్రారంభం
- పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు
- ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు
- ఒత్తిడికి లోను కావొద్దంటున్న నిపుణులు



దహెగాం మండలం కుంచవెల్లిలో చదువుకుంటున్న 'పది' విద్యార్థులు

దహెగాం(సిర్పూర్): పరీక్షల సమయం రానే వచ్చింది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల సీజన్ ఏప్రిల్ 23 వరకు కొనసాగనుంది. ఆ తర్వాత కూడా వివిధ ప్రవేశ పరీక్షలు ఉండే అవకాశం ఉంది. కాగా ఇప్పటికే జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ హేమంత్ బోర్కడే వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.

ఉత్తమ ఫలితాలపై దృష్టి..

పదో తరగతితోపాటు ఇంటర్ ఫలితాల్లో జిల్లాను ఉత్తమంగా నిలపాలని అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా మెరుగైన స్థితిలో నిలుస్తున్నా.. ఏటా పదో తరగతి ఫలితాలు మాత్రం నిరాశ పరుస్తున్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పది విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారికి సైతం అల్పాహారం అందిస్తున్నారు. చదువులో వెనుకబడిన వారి కోసం పత్యేకంగా విద్యాదీపికలు రూపొందించారు. పరీక్షలు సమీపించిన నేపథ్యంలో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోంది. పాఠశాలలు, కళాశాలల్లో సైకాలజీ నిపుణులు లేకపోవడంతో విద్యార్థుల మానసిక స్థితిని అంచనా వేయడం కష్టంగా మారుతోంది. దీనికి తోడు జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. అపరిశుభ్ర వాతావరణం, కలుషిత ఆహారం తిని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలు జిల్లాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఈ రెండు, మూడు నెలలపాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో తాగు నీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.

పరీక్షల నిర్వహణపై సమీక్ష..

కలెక్టర్ హేమంత్ బోర్కడే పదో తరగతి పరీక్షల నిర్వహణపై, ఇంటర్ పరీక్షల నిర్వహణపై డీఐఈవో శ్రీధర్ సుమన్ శుక్రవారం సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 15 నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 9,933 మంది ఇంటర్ విద్యార్థులు ఉండగా, జనరల్ విద్యార్థులు 8,457 మంది, ఒకేషనల్ 1,476 మంది ఉన్నారు. ప్రథమ సంవత్సరంలో 5,135 మంది, ద్వితీయ సంవత్సరంలో 4,798 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ప్రభుత్వ కళాశాలల్లో 11, ప్రైవేట్ కళాశాలల్లో 9 కేంద్రాలు ఉన్నాయి. అలాగే పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 39 పరీక్ష కేంద్రాల్లో 6,670 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,048 మంది ప్రైవేట్ విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కానున్నారు. వీరి కోసం 37 నుంచి 39 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పరీక్షల సమయంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. మసాలాలు, వేపుళ్లకు దూరంగా ఉండాలి.
- తాజా ఆహారం, కూరగాయలు, ఆకు కూరలు, మజ్జిగ వంటివి ఎక్కువగా తీసుకోవాలి.
- వేసవి దృష్ట్యా డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఎక్కువగా నీళ్లు తాగాలి.
- పరీక్షల భయంతో రాత్రంతా మేల్కొని చదివితే నిద్ర సరిపోక చదివిన అంశాలు గుర్తుండవు. విద్యార్థులకు సరిపడా నిద్ర అవసరం.
- పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ విశ్లేషనాత్మకంగా చదవాలి.
- వీలయినంత వరకు టీవీ, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి.
- ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుంటూ.. ఉపాధ్యాయులను అడిగి సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

తగినంత నిద్ర అవసరం



పరీక్షల సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడి పెంచుకోవద్దు. అర్ధరాత్రి వరకు ఉండకుండా సమయానికి నిద్రపోవాలి. తెల్లవారు జామున చదివితే ప్రయోజనం ఉంటుంది. విద్యార్థులకు తగినంత నిద్ర అవసరం. డీహైడ్రేషన్ కాకుండా పండ్లరసాలు, మజ్జిగతోపాటు వీలయినంత ఎక్కువగా నీళ్లు తాగాలి. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సిద్ధం కావాలి.

– స్పందన, వైద్యాధికారి, దహెగాం

మోకుదెబ్బ జిల్లా కార్యవర్గం ఎన్నిక

రెబ్బెన(ఆసిఫాబాద్): గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులు గౌడ్ తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పెరుమాండ్ల సత్యనారాయణ(ఆసిఫాబాద్), జిల్లా అధ్యక్షుడిగా కోంద్ర మనోహర్‌గౌడ్(బెజ్జూర్), కార్య నిర్వాహక అధ్యక్షుడిగా బొమ్మగాని శంకర్‌గౌడ్(తిర్యాణి), ఉపాధ్యక్షులుగా మడిపెల్లి లక్ష్మినారాయణగౌడ్(రెబ్బెన), మల్లుగారి శేఖర్‌గౌడ్(వాంకిడి), సార రమేష్‌గౌడ్(తిర్యాణి), భీండి రాజేందర్‌గౌడ్(కౌటాల), దిండు రాజుగౌడ్(కాగజ్‌నగర్), రంగు శ్రీనివాస్‌గౌడ్(రెబ్బెన), బండి దామోదర్‌గౌడ్(దహెగాం), ప్రధాన కార్యదర్శులుగా ఆకుల శ్రీనివాస్‌గౌడ్(ఆసిఫాబాద్), రామగోని నీలగౌడ్(చింతలమానెపల్లి), కార్యదర్శులుగా నాగపూరి రమేశ్‌గౌడ్(తిర్యాణి), దింగు సునీల్‌గౌడ్(కాగజ్‌నగర్), బొడిగుల ప్రేంసాగర్‌గౌడ్(సిర్పూర్- టి)), కేసరి కిషన్‌గౌడ్(గోలేటి), అన్నపూర్ణ మురళీగౌడ్(రెబ్బెన), నగునూరి తిరుపతిగౌడ్(కాగజ్‌నగర్), కోశాధికారిగా తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్(నంబాల), అధికార ప్రతినిధులుగా కొయ్య రాజాగౌడ్(పెంచికల్‌పేట్), బుర్ర రమేశ్‌గౌడ్ (తిర్యాణి), అన్నపూర్ణ శాంతికుమార్ గౌడ్(రెబ్బెన), చేపూరి నవీన్‌గౌడ్(గోలేటి)తోపాటు ప్రచార కార్యదర్శులు, గౌరవ సలహాదారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలి



ఇందిరానగర్ వద్ద నాయకులకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రేగుంట కేశవ్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై యుద్ధానికి మాదిగ జాతి సిద్ధం కావాలని ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రేగుంట కేశవ్‌రావు పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర శనివారం రెబ్బెన మండలంలోకి ప్రవేశించగా ఇందిరానగర్ వద్ద మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేశవ్‌రావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఏళ్లుగా పోరాటాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే వందరోజుల్లోనే వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. వెంటనే వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు అనుకూలంగా ఉన్నా బీజేపీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. ఏప్రిల్ 4న హైదరాబాద్ ముట్టడికి పెద్దఎత్తున మాదిగలు, ఉప కులాలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా కన్వీనర్ చెన్నూరి సమ్మయ్య, జిల్లా కోకన్వీనర్ సుందిళ్ల మల్లేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపెల్లి ప్రభాకర్, మండల కన్వీనర్ సురేశ్, నాయకులు రమేశ్, ఇగురపు రమేష్, జంగంపల్లి రాజేశ్, ప్రశాంత్, ఉదయ్‌కిరణ్, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'బిందు'వు ఇక భారమే!

ఉద్యానవన పంటలతో లాభాలు గడించాలనే రైతులకు సాగు ఆర్థిక భారమవుతోంది. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం మిగితా ఉద్యానవన పంటలకు రాయితీలు ఇవ్వడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. జిల్లాలో అనేక మంది రైతులు బిందు సేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకుని నెలల తరబడి ఎదురు చూస్తున్నారు.

- ఉద్యానవన పంటల సాగుదారులకు అందని రాయితీ పరికరాలు
- దరఖాస్తు చేసుకున్న 448 మంది రైతులకు తప్పని నిరాశ
- ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా అందించడం కష్టమే..
- ఆయిల్‌పామ్ తోటలకే ప్రాధాన్యం ఇస్తున్న అధికారులు



బిందు సేద్యం ద్వారా సాగు చేస్తున్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

తిర్యాణి(ఆసిఫాబాద్): ఉద్యానవన పంటల సాగును పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. గతంలో ఆసక్తి గల రైతులకు బిందు సేద్యం, తుంపర పరికరాలు రాయితీపై అందించింది. ప్రభుత్వ నిర్ణయాలతో ఇక నుంచి బిందు సేద్యం పరికరాల కొనుగోలు అన్నదాతలకు భారంగా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఆయిల్‌పామ్ పంటకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ మిగిలిన ఉద్యానవన పంటలను పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేక ఉద్యానవన పంటల సాగును తగ్గించుకుంటున్నారు.

దరఖాస్తు చేసుకున్న 448 మంది రైతులు..

ఆయిల్‌పామ్‌ను మినహాయించి జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ పంటల సాగుకు 448 మంది రైతులు బిందు సేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2022– 23 ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 19 రోజుల సమయం మాత్రమే ఉంది. ఇప్పటివరకు ఉద్యానవన శాఖ నుంచి ఒక్కరికి కూడా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందలేదు. ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగుకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 1,048 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యం పెట్టుకోగా 330 ఎకరాల్లో సాగుకు రైతులు ముందుకొచ్చారు. ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొచ్చే రైతులకు ప్రభుత్వం నాలుగేళ్లపాటు ఆర్థిక ప్రోత్సాహం కూడా అందజేస్తోంది.

'ఆయిల్‌పామ్'కు తొలి ప్రాధాన్యం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఆయిల్‌పామ్ సాగుకు తొలి ప్రాధాన్యం ఇచ్చాం. బిందు సేద్యం పరికరాలు కూడా వారికే మంజూరు చేస్తున్నాం. ఆయిల్‌పామ్ సాగును మినహాయించి మిగిలిన పంటల సాగుకు జిల్లాలో 448 మంది రైతులు బిందు సేద్యం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బిందు, తుంపర పరికరాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– నదీమ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

రైతులకు తప్పని ఎదురుచూపులు

ఉద్యానవన శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా బిందు సేద్యం పరికరాలు అందజేసేవారు. బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీ ఉండేది. తాజాగా కూరగాయలు, మామిడి, జామ, నిమ్మ, దానిమ్మతోపాటు ఇతర పండ్ల తోటలకు ప్రభుత్వం రాయితీని నిలిపివేసింది. దీంతో జిల్లాలో రైతులు సొంత ఖర్చుతో డ్రిప్ ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 15 మండలాల పరిధిలో నేలలు ఉద్యానవన పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. గిరిజన రైతులను ప్రోత్సహిస్తే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుంది. సాధారణంగా ఎకర విస్తీర్ణంలో బిందు సేద్యం పరికరాలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు వస్తోంది. ప్రభుత్వం రాయితీ నిలిపివేయడంతో చాలా మంది రైతులు ఆర్థిక భారంతో ఉద్యానవన పంటల సాగును పక్కన పెట్టి ఇతర పంటల సాగుకుమొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 448 మంది రైతులు 1,128 ఎకరాల్లో బిందు సేద్యం పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు ఆ శాఖ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. డ్రిప్ పరికరాలు వినియోగం ద్వారా సాగులో 43 శాతం నీరు ఆదా చేయొచ్చు. 33 శాతం విద్యుత్ వినియోగం తగ్గడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు మిగులుతాయి. అలాగే బిందు సేద్యం ద్వారా 52 శాతం దిగుబడి పెరుగుతుందని స్వయంగా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులైన వారికి బిందు సేద్యం పరికరాలు రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని 1వ వార్డు తారకరామకాలనీలో శనివారం వీధికుక్కలు వీరంగం సృష్టించాయి. కాలనీకి చెందిన రాజేశ్వరి, హుస్సేన్‌బీ, సంధ్యలపై ఒక్కసారిగా దాడిచేసి గాయపర్చాయి. బాధితులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని, ఇప్పటికైనా కుక్కల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు ప్రమాదం నుంచి తృటిలో బయటపడ్డాడు



వ్యక్తిని బయటకు లాగుతున్న స్థానికులు

మంచిర్యాలక్రైం: రైలు ప్రమాదం నుంచి ఓ వ్యక్తి తృటిలో బయటపడిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. మహారాష్ట్రలోని చంద్రపూర్ గుగ్గాసకు చెందిన బొజ్జం కుమారస్వామి మంచిర్యాల పట్టణంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు శనివారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రప్తిసాగర్ రైలు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి ప్లాట్‌ఫాం, రైలు మధ్యలో ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు కుమారస్వామిని కష్టంగా బయటకు తీశారు. రైలు కదులుతుండగా పడిపోయిం ఉంటే ఘోరం జరిగేదని స్థానికులు తెలిపారు.

వలస కూలీ ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: స్థానిక హమాలివాడలో నివాసం ఉంటున్న వలస కూలీ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నెన్నెల మండలం ఖర్జీ గ్రామానికి చెందిన చింత మహేష్(42) మూడేళ్లక్రితం కుటుంబంతో కలిసి మంచిర్యాలకు వలస వచ్చాడు. హమాలివాడలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మహేశ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య నైన, కుమారులు హర్షచరణ్, హనుష్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మంచిర్యాలక్రైం: మంచిర్యాలకు చెందిన వృద్ధుడు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై రామారావు తెలిపారు. గోపాల్‌వాడకు చెందిన భూతం లింగయ్య (85) పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాడు. ఈ నెల 5న లింగయ్య బీడీ తాగి మీద పడేసుకోవడంతో శరీరం కాలిపోయింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. చికిత్స పొందుతుండగా శనివారం మృతి చెందాడు.

గంగిపెల్లిలో యువకుడు..

జైపూర్(చెన్నూర్): మండలంలోని గంగిపెల్లి గ్రామానికి చెందిన అట్ల ప్రశాంత్ (32) ఈ నెల 5న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

మళ్లీ ప్రాణం పోసేలా..



- సీపీఆర్‌తో ఆగిన గుండెకు ఊపిరి
- ఇటీవల పెరిగిన గుండెపోటు మరణాలు
- అప్రమత్తమై డాక్టర్లకు శిక్షణ ఇస్తున్న వైద్యశాఖ
- ఈ నెలలో సిబ్బందికి, ఆ తర్వాత ఇతర శాఖల్లోనూ తర్ఫీదు

నిర్మల్‌చైన్‌గేట్: దేశవ్యాప్తంగా సడెన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతున్నాయి. నిత్యం పలువురు గుండెపోటుతో చనిపోతున్నారు. యుక్త వయస్సులో ఉన్నవారు, చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ చేస్తే బతికే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై గుండెపోటు సంఘటనలపై జాగ్రత్తగా ఉండాలని, సీపీఆర్ చేసే విధానంపై దృష్టి సారించాలని వైద్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. గుండెపోటు వచ్చిన వ్యక్తులకు వైద్యం అందేలోపు సీపీఆర్ ప్రక్రియ నిర్వహిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎంపీ (ఫైల్)

- గత నెల 26న నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(కె)లో పెళ్లి బరాత్‌లో పెళ్లి కుమారుని బంధువైన మహారాష్ట్రలోని శివుని గ్రామానికి చెందిన ముత్యం(18) అనే యువకుడు డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన స్థానికులు యువకుడిని లేపి పరిశీలించగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- గత నెల 27న నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని చించాలలో ఒకేరోజు ఇద్దరు వ్యవసాయ కూలీలు గుండెపోటుతో మృతి చెందారు. వరగంటి లక్ష్మణ్ (33) ఆదివారం రాత్రి 11 గంటలకు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన గ్రామస్తులతో పాటు కండెల రాఘవులు (42) మృతున్ని చూసేందుకు వెళ్లారు. ఇంటికి తిరిగివచ్చిన రాఘవులు 12 గంటల ప్రాంతంలో గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- ఈ నెల 9న నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు చిలుకూరి విజయేందర్ (51) గుండెపోటుతో మృతి చెందాడు. పెంబి మండలం మందపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న విజయేందర్ విధులకు వెళ్లేందుకు ఉదయం ఇంట్లో సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబీకులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- ఈ నెల 11న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రూప్‌నాయక్‌తండాకు చెందిన బూక్యా దశరథ్‌నాయక్ (51) గుండెపోటుతో మృతి చెందాడు. కవ్వాల్ బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌గా పనిచేస్తున్న దశరథ్ నాయక్ జన్నారం పాఠశాల ఇన్‌చార్జి వార్డెన్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విపరీతమైన దగ్గుతో పాటు చాతిలో నొప్పిరావడంతో కుటుంబ సభ్యులు జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో లక్సెట్టిపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

మాస్టర్ ట్రైనింగ్ పూర్తి

ఈ నెల 1న మంచిర్యాల జిల్లాలోని ఐదుగురు ప్రభుత్వ వైద్యులకు ఇటీవల హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనింగ్ అందించారు. పాతమంచిర్యాల యూపీహెచ్‌సీ డాక్టర్ రమేశ్, షంశేర్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ సృజన్, దండేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సతీశ్, జైపూర్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అనిల్, వేమనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాజేశ్ శిక్షణ పొందారు. నిర్మల్ జిల్లాలో వెల్మల్, పెంబి, కుంటాల, బాసర పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ ఇచ్చారు. మున్సిపల్, పోలీస్, రెవెన్యూతో పాటు ఇతర శాఖల సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ అందించనున్నారు.

అకస్మాత్తుగా ఎందుకు ఆగిపోతుంది..

ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డ కట్టడం, గుండె కొట్టుకోవడంలో సమస్యలు ఏర్పడటం, గుండె కండరం దళసరిగా ఉండడం, ఒత్తిడి వంటి ఏదో కారణంతో సడన్ కార్డియాక్ అరెస్ట్ ఏర్పడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మనం తినే ఆహారం కూడా గుండెపోటు రావడానికి కారణమంటున్నారు. సడన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైతే గుండె మొత్తం ఒకేసారి పనిచేయడం ఆగిపోయి నిమిషాల వ్యవధిలోనే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. జంక్‌ఫుడ్, స్థూలకాయం, ధూమపానం, అధికంగా మద్యం సేవించడం, మానసిక ఒత్తిడి, రక్తపోటు, మధుమేహం కారణంగా గుండె వ్యాధి లేని వారు కూడా సడన్ కార్డియాక్ అరెస్ట్ బారిన పడుతున్నారు. రోజూ వ్యాయామం చేస్తే కార్డియాక్ అరెస్ట్ బారిన పడకుండా కొంతవరకు కాపాడుకునే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

సీపీఆర్ ఎలా చేయాలంటే?

సీపీఆర్.. (కార్డియో పల్మనరీ రీససిటేషన్) గుండె పనితీరు అకస్మాత్తుగా ఆగిపోయేటప్పుడు, ఆగిపోయిన వారికి వెంటనే పంప్ చేసేందుకు ఈ ప్రక్రియ చేపడతారు. సీపీఆర్ చేసేటప్పుడు బాధితుడిని బల్లపరుపుగా ఉన్న స్థలంలో పడుకోబెట్టాలి. ఎడమచేతి వేళ్ల మధ్య కుడిచేతి వేళ్లు లేదా కుడిచేతి వేళ్ల మధ్య ఎడమచేతి వేళ్లు జొప్పించి బాధితుడి ఛాతి (గుండెపై కాదు)మధ్య భాగంలో నొక్కాలి. క్రమంగా ప్రెస్ చేస్తూ ఉండాలి. నొక్కేటప్పుడు మన చేతులు, మోచేతులు అసలు బెండు కాకూడదు. చేతులు స్టిఫ్‌గా ఉంచి నొక్కాలి. బాధితుడి చాతి కనీసం ఐదు సెంటీమీటర్లు లోపలికి వెళ్లేలా నొక్కాలి. ఎముకలు విరిగిపోతాయని భయపడకూడదు. నిమిషానికి వందసార్లు ప్రెస్ చేశాక పల్స్ చెక్ చేయాలి. పల్స్ దొరకకపోతే మళ్లీ ఆ ప్రక్రియ కొనసాగించాలి. ఇలా ఒక్కోసారి 20 నుంచి 30 నిమిషాల వరకు చేస్తూనే ఉండాలి. కంటిన్యూస్‌గా చేస్తున్నప్పుడు గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే సీపీఆర్ చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఆలస్యం చేస్తే లాభం ఉండదు. ఇవి చేస్తూనే అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాలి.

వైద్యసిబ్బందికి శిక్షణ ఇస్తాం



ఇటీవల గుండెపోటు మరణాలు ఎక్కువగా సంభవిస్తుండడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లాలోని ఐదుగురు వైద్యులకు ఇటీవల హైదరాబాద్‌లో సీపీఆర్‌పై శిక్షణ అందించారు. జిల్లాలోని వైద్యులు, వైద్య సిబ్బందికి ఆ ఐదుగురు వైద్యులతో శిక్షణను ఇవ్వాల్సి ఉంది. ఇంకా తేదీని నిర్ణయించలేదు. దశల వారీగా అందరికీ సీపీఆర్‌పై శిక్షణ అందిస్తాం. – డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల

అవగాహన పెంచుకోవాలి



గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ ప్రక్రియ చాలా ప్రధానమైనది. ఆలస్యం చేయకుండా వెంటనే చేతులతో కొన్ని నిమిషాల పాటు ప్రెస్సింగ్ చేస్తే తిరిగి గుండె పనిచేస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా మనిషి ప్రాణాలను తిరిగి నిలబెట్టవచ్చు. సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలి.
– డాక్టర్ రత్నాకర్, ఎండీ జనరల్ ఫిజీషియన్, సర్వజన ఆస్పత్రి, నిర్మల్

బతికే అవకాశం ఉంది



ఎవరైనా గుండెపోటుకు గురై హఠాత్తుగా పడిపోతే సీపీఆర్ చేయడంతో బతికే అవకాశాలు ఉన్నాయి. రెండు చేతులతో రోగి చాతిపై బలంగా నొక్కాలి. ఇలా 20 నుంచి 30 సార్లు చేయడం వల్ల రక్త ప్రసరణ జరిగి గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. వెంటనే రోగిని దవాఖానాకు తీసుకెళ్లాలి.
– డాక్టర్ అరుణ్ మోరే, గుండె వైద్యనిపుణుడు, డీవీఆర్ హాస్పిటల్, నిర్మల్

‘గిరి’ మహిళలకు ‘స్టార్ లెజెండ్’

- అవార్డుకు ఎంపికైన కన్నిబాయి, సోంబాయి
- ఆదివాసీ బిడ్డలకు దక్కిన గౌరవం

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని భీమన్‌గోంది గ్రామానికి చెందిన మడావి కన్నిబాయి సేవా కార్యక్రమాలతో పాటు, కొలాం ఆదివాసీల జీవిత చరిత్ర, వారు పడుతున్న కష్టాలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి చూపారు. సాహస కృత్యాల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిల్లో పలు పతకాలు సాధించారు. అడ్వెంచర్ క్లబ్‌కే బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. విశ్వంబరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి సువర్ణకుమారి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మడావి కన్నిబాయి, కుమురం భీం మనవరాలు కుమురం సోంబాయికి ×జాతీయ మహిళా స్టార్ లెజెండ్÷ అవార్డును అందజేశారు.



అవార్డును ప్రదానం చేస్తున్న సువర్ణకుమారి

ఇరువురిని శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోశ్ కుమార్, పల్లం నవీన్‌కుమార్, స్వరూపరాణి, మాధవి, నీరజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి పేరుతో శ్రమదోపిడీ

శ్రీరాంపూర్: సింగరేణి అధికారులు జన్మభూమి పేరుతో కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్ ఆరోపించారు. ఆర్కే న్యూటెక్ గనిపై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌లో కార్మికులు మస్టర్ పడిన తర్వాత డిస్ట్రిబ్యూషన్ చేయకుండా జన్మభూమి పేరుతో సర్ఫేస్ నుంచి లోపలికి తరలించే సామగ్రిని టబ్బుల్లో లోడ్ చేయిస్తున్నారని తెలిపారు. ఇలా ఇతర పనులు చేయించడం అధికారులకు అలవాటుగా మారిందని పేర్కొన్నారు. దీనిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రక్షణ పేరుతో కార్మికులకు ఇస్తున్న రేడియం జాకెట్లు చిరిగి పోతున్నాయన్నారు. నాణ్యమైనవి ఇవ్వాలన్నారు. భూపాలపల్లిలో జరిగిన మిస్‌ఫైర్ ప్రమాదంలో ఓ షాట్‌ఫైరర్‌ను డిస్మిస్ చేయడం, సర్దార్‌కు 8 ఇంక్రిమెంట్లు కట్ చేయడం, ఓవర్‌మెన్‌ను డీ ప్రమోట్ చేయడం అన్యాయమన్నారు. దీనిని అడ్డుకోవడంలో గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు.



మాట్లాడుతున్న జీవన్‌జోయల్

గైర్హాజరు పేరుతో కార్మికులను డిస్మిస్ చేస్తున్నా అడ్డుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల సమస్యలపై పోరాడకుండా యాజమాన్యానికి తొత్తుగా మారుతున్న ఈ సంఘాలకు వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. సింగరేణిలో కొత్త గనులు తేవాలని, బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత యువకులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, ఫిట్ సెక్రెటరీ బొడ్డు సురేందర్, నాయకులు రాజేంద్రప్రసాద్, ఎం.కొమురయ్య, కంబాల నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ క్వాలిఫైడ్ రెఫరీగా పార్‌పల్లి వాసి



ప్రేమ్‌కుమార్

కోటపల్లి(చెన్నూర్): రాష్ట్రస్థాయి వాలీబాల్ క్వాలిఫైడ్ రెఫరీగా మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన బోగె ప్రేమ్ కుమార్ ఎన్నికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన స్టేట్ లెవల్ వాలీబాల్ రిఫెరీ పరీక్షల్లో జిల్లాల వారీగా ఉత్తీర్ణత అభ్యర్థుల పేర్లను ప్రకటించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కోటపల్లి మండలం పార్‌పల్లి గ్రామానికి చెందిన బోగే ప్రేమ్‌కుమార్ అర్హత సాధించినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్‌ను జిల్లా కోచ్ రాంమోహన్, శ్రీనివాస్, సందీప్, అంజి అభినందించారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్ హఠాన్మరణం



దశరథ్‌నాయక్ (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): మండలంలోని రూప్‌నాయక్ తండాకు చెందిన బూక్యా దశరథ్ నాయక్ (51) శనివారం తెల్లవారు జామున హఠాన్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కవ్వాల్ బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌గా, జన్నారం ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. రాత్రి 2 గంటల ప్రాంతంలో విపరీతంగా దగ్గుతో పాటు చాతిలో నొప్పి వస్తుందని భార్యకు చెప్పడంతో వెంటనే జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో లక్సెట్టిపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితోనే దశరథ్ నాయక్ గుండెపోటుతో మృతి చెందాడని, ఒత్తిడికి గురిచేసిన అధికారులపై కేసులు నమోదు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



కైరిగూడ ఓసీపీని సందర్శిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, జీఎం కొండయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆర్థిక సంవత్సరంలో బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) జి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. జీఎం (పీఅండ్‌పీ) కొండయ్యతో కలిసి బెల్లంపల్లి ఏరియాలో శనివారం పర్యటించా రు. కైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఏరియాలో కొనసాగుతున్న ఉత్పత్తి ఉత్పాదకతతోపా టు సివిల్ పనులపై ఏరియా అధికారులను అ డిగి తెలుసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ల క్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం వచ్చే ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి లక్ష్యాలపై ఏరియా అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో స మీక్ష నిర్వహించారు. సమావేశంలో ఏరియా జీ ఎం దేవేందర్, కై రిగూడ పీవో ఉమాకాంత్, ఏరి యా సర్వే అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్చరల్ ఫెస్ట్ నిర్వహణ అభినందనీయం



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్

ఉట్నూర్(ఖానాపూర్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం ఐటీడీఏ ఆధ్వర్యంలో కుమురంభీం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడం కోసం గిరిజన సంక్షేమ శాఖ చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్యార్థులకు అవగాహన కలిగించేలా కార్యక్రమం రూపొందించామన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు గిరిజన క్రీడోత్సవాలు, సైన్స్ ఫెర్ ప్రదర్శనలు, మార్చిలో కల్చరల్ ఫెస్ట్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 51 మంది విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలీప్‌కుమార్, ఉట్నూర్, భీంపూర్ జెడ్పీటీసీలు చారులత, సుధాకర్, డీటీడీవోలు మణెమ్మ, నీలిమ, ఏసీఎమ్‌వో జగన్ పాల్గొన్నారు.